క్లుప్తంగా

నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

బలిజిపేట: మండలంలోని వంతరాం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సింహాచలం తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉండే చెట్ల కొమ్మలు కొట్టివేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు దీనిని దృష్టిలో పెట్టుకుని సహకరించాలని కోరారు.

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్య వేక్షణలో లక్ష్మీనృసింహ స్వామి వారిని అర్చకులంతా ప్రత్యేకంగా అలంకరించారు. స్వామికి గురువారం ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులతో పాటు జిల్లాలోని పలుప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శనానికి వచ్చి మొక్కులు చెల్లించారు. దూర ప్రాంతాల నుంచి పూజల నిమిత్తం వచ్చిన భక్తులతో అభిషేకాలు, కుంకుమ పూజలు చేయించిన అనంతరం తీర్థప్రసాదాల వితరణ చేశారు.

జీజే కాలేజీలో ప్రవేశాలకు ఆహ్వానం

సీతానగరం: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారంతా విద్యాబోధనకు అవసరమైన మౌలిక వసతులున్న సీతానగరంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరాలని ప్రిన్సిపాల్ డీజీవీఎస్ త్రినాథ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులతో కలిసి బూర్జ, సీతానగరం ఉన్నత పాఠశాలలకు వెళ్లి పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో వనరులు, విద్యా బోధనపై విద్యార్థులకు ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు డి.రామకృష్ణ, ఎస్. అచ్చంనాయుడు, శ్రీధర్, బి.రమేష్, బూర్జ, సీతానగరం ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ సీనియర్ నేత రాజశేఖరం

పాలకొండ: మండలంలోని తంపటాపల్లి గ్రామానికి చెందిన వలంటీర్ బొమ్మాళి శ్రీనివాసరావు కుటుంబానికి మంజూరైన రూ.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పాలవలస రాజశేఖరం చేతులమీదుగా గురువారం అందజేశారు. ఇటీవల సదరు వలంటీర్ మృతి చెందగా, అతడి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి నిధులు మంజూరయ్యేలా ఎమ్మెల్సీ విక్రాంత్ చొరవ తీసుకున్నారు. ఈ మేరకు విడుదలైన నిధులను చెక్కు రూపంలో శ్రీనివాసరావు తల్లి సింహాచలం..కు అందించారు.

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో జైగురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ సహకారంతో అర్చకులు ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హోమం, పూజలు చేపట్టారు. వీరఘట్టం, పార్వతీపురం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొనగా, హోమంలో పాల్గొనడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

వంగర: మండలంలోని సంగాం గ్రామంలో ఉన్న శ్రీసంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వారం రోజులుగా కొనసాగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. మూడు నదులు కలిసే త్రివేణి సంగమంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఏటా ఇక్కడ జరిగే ఉత్సవాలు ఎంతో ప్రసిద్ధి కాగా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి, తమ మొక్కులు తీర్చుకోవడం విశేషం.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- వందపడకల ఆస్పత్రి పనులు త్వరగా పూర్తిచేయండి
- విద్యార్థుల ఆరోగ్యంపై అలసత్వం వద్దు
- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు:

ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని వందపడకల ఆస్పత్రి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, వంద పడకల ఆస్పత్రి పనులు సుమారు 80 శాతం పూర్తయ్యాయని, వైటీసీ సమీపంలో అర్బన్ హెల్త్ సెంటర్ పనులు 90 శాతం పూర్తయ్యాయని ఈ రెండు నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని కోరారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఒక్క మన రాష్ట్రంలోనే అత్యధిక స్థాయిలో వైద్యులు, వైద్యసిబ్బంది నియామకాలు జరిగాయని, ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నామని వివరించారు. పట్టణంలో వంద పడకల ఆస్పత్రికి సంబంధించి గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ శ్లాబ్‌లు పూర్తయ్యాయని, 2,3,5 వార్డు, ఫస్ట్‌ఫ్లోర్‌ప్లాస్టింగ్‌లు పూర్తయిన నేపథ్యంలో ఆస్పత్రి నిర్మాణం త్వరలోనే పూర్తవుతుందన్నారు. పూర్తయిన బ్లాక్‌లను తక్షణమే వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించనున్నట్లు తెలిపారు. తుది దశకు చేరుకున్న ఈ వంద పడకల ఆస్పత్రిని మళ్లీ మేము నిర్మిస్తామని టీడీపీ నాయకులు సంధ్యారాణి, లోకేష్‌లు ఇటీవల తెలపడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఆ నాయకులు ఎప్పుడైనా ఈ ఆస్పత్రికి వస్తే వారికి వైద్యసేవలు అందించనున్నామన్నారు. హాస్టల్స్‌లో చదువుతున్న విద్యార్థులు ఆరోగ్యం పట్ల వార్డెన్‌లు, హెచ్‌ఎంలు అలసత్వం వహించవద్దని సూచించారు. తమ పిల్లలపై ప్రేమతో ఇళ్ల నుంచి విద్యార్థులు తల్లిదండ్రులు తినుబండారాలు తీసుకువస్తుంటారని, వాటిని ఉపాధ్యాయులు పరిశీలించిన తరువాతే విద్యార్థులకు ఇవ్వాలని సూచించారు.



ఏరియా ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సీఎంఆర్ పరికరాన్ని ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

ఏరియా ఆస్పత్రిలో సీఎంఆర్ పరికరం ప్రారంభం

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఎముకల వైద్యసేవలకు సంబంధించిన సుమారు రూ.15 లక్షల విలువైన సీఎంఆర్ మెషీన్‌ను ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర గురువారం ప్రారంభించారు. ఈ మేరకు ఏరియా ఆస్పత్రిని పరిశీలించిన ఆయన ఈ పరికరాన్ని ప్రారంభించిన అనంతరం ఆస్పత్రిలో రోగుల వద్దకు వెళ్లి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న చికిత్స, సదుపాయాలు తదితర అంశాలపై ఆరా తీశారు. పలువురు ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. నిపుణులైన వైద్యులు, ఆధునిక వైద్యపరికరాలు ఉండడం వల్ల ఓపీ సంఖ్య కూడా పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ఆస్పత్రి సూపరింటెండెంట్ రత్నకుమారి, వైద్యులు, అర్బన్ బ్యాంకు అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పార్వతీపురం టౌన్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం అన్నారు. ఈ మేరకు గురువారం నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పిల్లలకు చదువే ముఖ్యమని, బాల్య వివాహాలు చేసి వారి భవిష్యత్‌ను పాడు చేయవద్దని తల్లిదండ్రులకు హితవు పలికారు. లీగల్, ప్రొబేషన్ జిల్లా అధికారి పి.శ్రీధర్ మాట్లాడుతూ పిల్లల హక్కుల, బాధ్యతల గురించి వివరించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి అవగాహన కల్పించారు. బాలల అక్రమ రవాణా, బాలికలకు ఆపద సమయంలో అవసరమైన సహాయం కోసం చైల్డ్‌కేర్ హెల్ప్‌లైన్‌ను ఎలా సంప్రదించాలో సమగ్రంగా వివరించారు. కార్య క్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఇన్‌చార్జి పీఓ ఎస్.ప్రసాదరావు, కౌన్సిలర్ జి.తవిటినాయుడు, ఓఆర్‌డబ్ల్యూ, ఆర్.హరికృష్ణ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం

తీరనున్న రహదారి ఇబ్బందులు

- మార్కొండపుట్టి జంక్షన్ నుంచి, తుండ వరకు రోడ్డు మరమ్మతులు
- పనులు ప్రారంభించిన ఆర్‌అండ్‌బీ అధికారులు

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి గ్రామం నుంచి నంద గ్రామానికి వెళ్లే రహదారి మొత్తం పాడైపోయి. పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు ప్రయాణికుల సౌకర్యార్థం అర్జెంట్ రిపేర్స్ స్కీం నిధులు సుమారు రూ.12లక్షలతో మార్కొండపుట్టి జంక్షన్ నుంచి, గైశీల గ్రామం మీదుగా, సాలూరు మండలంలోని తుండ జంక్షన్ వరకు రహదారి మరమ్మతు పనులను ఆర్‌అండ్‌బీ జేఈ కమలాకర్ గురువారం ప్రారంభించారు. రహదారిలో ఏర్పడిన గోతులను తారు, వైట్‌మిక్సర్‌తో పూడ్చివేస్తున్నారు. రహదారిలో ఏర్పడిన పెద్ద గోతులను పూడ్చివేస్తుండడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మరమ్మతులను పర్యవేక్షిస్తున్న జేఈ కమలాకర్

పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించండి

బలిజిపేట: రానున్న పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఎంఈఓ–1సామల సింహాచలం విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని అరసాడ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు గురువారం ఆయన తగు సూచనలు అందించారు. ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్న పరీక్షలలో విద్యార్థులు మానసిక ధైర్యంతో రాయాలని పిలుపునిచ్చారు. ప్రీ ఫైనల్ పరీక్షలలో ఏవిధంగా పరీక్షలు రాశారో అదేవిధంగా రాయాలని, కొత్తవాటిని చదువుకోకుండా ఇంతవరకు చదువుకున్న పాఠ్యాంశాలను పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. భవిష్యత్ చదువుకు పది పరీక్షలే పునాది అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ సామల సింహాచలం

పురపాలక సంఘం అభివృద్ధికి చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పురపాలకసంఘం అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం పట్టణ అభివృద్ధికి సంబంధించి అజెండాను ప్రవేశపెట్టామన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి సంబంధించిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేష్, మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీతానగరం: రైతులు, రైతు కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మికసంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర రహదారిపై రాస్తారోకో, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్‌వీ రమణమూర్తి మాట్లాడుతూ రైతు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు ధర లేక పోవడంతో పంటలు పండించినా కేంద్రం గిట్టుబాటు ధరకల్పించకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదన్నారు. వ్యవసాయ కార్మికులకు పనులు లేకపోవడం వల్ల ఉపాధి హామీపనులు 200 పనిదినాలు ఇవ్వాలని కోరారు. దీర్ఘకాలంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో మండల, జిల్లా రైతు సంఘం, వ్యవసాయ కార్మికసంఘం కార్యదర్శులు, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న రైతు సంఘం నాయకులు

వైఎస్సార్ సీపీతోనే గిరిజనాభివృద్ధి



శిలఫలకం ఆవిష్కరించి, గొటివాడ బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

కురుపాం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే గిరిజనాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వారు కలిసి గురువారం ప్రారంభించారు. ప్రారంభించిన వాటిలో రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించిన గొటివాడ బీటీ రోడ్డు, సచివాలయ భవనం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లతో పాటు, పాడి–ఒప్పంగి రోడ్డు, జి.శివడ–మద్దుగూడ, మద్దుగూడ–నాంద్రగండ, గుజ్జువాయి, వై.కొత్తగూడ, నీలకంఠాపురం–నాయుడుగూడ, నీలకంఠాపురం–కొత్తగూడ రోడ్లు ఉన్నాయి. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని, ఈ నాలుగున్నరేళ్లలో ఎన్నో ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అనేకానేక పథకాలతో ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. కురుపాం నియోజకవర్గంలో దశాబ్దాలుగా పాలించిన టీడీపీ నేతల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. జగనన్న ప్రభుత్వం ద్వారా ప్రతీ కుటుంబానికి లబ్ధి జరిగిందన్నారు. ఎన్నికల వేళ మోసపూరిత హామీలతో ఇంటింటికీ వస్తున్న టీడీపీ నేతలను నమ్మవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయభేరి మోగించడం ఖాయమని, టీడీపీకి ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. అందరి బాగోగుల కోసం పాటుపడుతున్న సీఎం జగనన్నకు మనమంతా అండగా నిలవాలని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేద్దాం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపు

సీతానగరం: ప్రజలకిచ్చిన మాట నిలబెట్టడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నైజమని, ఆ మాటకు కట్టుబడి 58 నెలల సంక్షేమ పాలనలో అన్నివర్గాలకు న్యాయం చేశారని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్సార్ చేయూత పంపిణీ కార్యక్రమాన్ని వెలుగు అధికారులు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జోగారావు.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని 5,430 మంది మహిళా లబ్ధిదారులకు రూ.10 కోట్ల,18 లక్షల,12 వేల, 500లు చెక్‌ను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మహిళలకే ఇంటి స్థలాలు, జగనన్న గృహాలతో సహా అన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్న భారత దేశంలోనే ఏకైక సీఎం జగనన్నే అని స్పష్టం చేశారు. 2019ఎన్నికల ముందు సీఎం జగనన్న ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చారని చెప్పారు. కరోనా కష్ట కాలంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అక్కచెల్లెమ్మలకు కష్టం తెలియకుండా పాలన సాగించారన్నారు. ప్రజల అవసరాలను తీర్చడమే జగనన్న ప్రభుత్వ ఆలోచనా విధానమని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు పొందిన వారంతా వైఎస్సార్‌సీపీకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రమణమ్మ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైస్‌ఎంపీపీ టి.సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, పార్టీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములు నాయుడు, ఎంపీటీసీ ఎస్.గౌరి, బి కుసుమ, పీఏసీఎస్ చైర్మన్ కూర్మారావు, పార్టీ మండల నాయకులు ఈశ్వరనారాయణ, వెంపలిగుర్రాజు, పి.సత్యనారాయణ, పార్థసారథి, వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు, సీసీలు, మండల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు, వీఓఏలు, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, వివిధ గ్రామాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



చేయూత చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురంటౌన్: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

కృష్ణారాయ పురం రోడ్డు ప్రారంభం

రాష్ట్రంలో ప్రజావసరాలకు అనుగుణంగా జగనన్న ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం రాత్రి సీతానగరం మండలంలోని కృష్ణారాయపురంలో రూ.40 లక్షలతో నిర్మాణం చేసిన బీటీరోడ్డు శిలాఫలకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రమణమ్మ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు శంకుస్థాపన

పార్వతీపురంటౌన్: అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం డీకే పట్టణం పంచాయతీ నుంచి తాడంగి వలస గిరిజన గ్రామం వరకు నూతన బీటీ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే జోగారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గిరిజనులకు ఇచ్చిన మాట ప్రకారం పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వెలగవలస కూడలి నుంచి డోకిశీల బీటీ రహదారి వరకు పాడైపోయిన రోడ్డు పునర్నిర్మాణం కోసం ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశానని తెలిపారు. డీకే పట్టణం పంచాయతీ నుంచి తాడంగి వలస గిరిజన గ్రామం వరకు నూతన బీటీ రహదారిని నిర్మించేందుకు శంకుస్థాపన నిర్వహించి పనులు ప్రారంభించడమే కాకుండా అదే రహదారిలో రూ.27లక్షల వ్యయంతో పైప్ కల్వర్ట్ పనులను ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ వి.గురురాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: మహిళల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం దగ్గరలో గురువారం జరిగిన వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మహిళల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రశంసించారు. ప్రతీ మహిళ ఆర్థికంగా ఎదగాలన్న దృఢ సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, అక్కచెల్లెమ్మలంతా బాగుండాలన్నదే ఆయన తపన అని అన్నారు. మహిళల సంక్షేమానికి అనేకానేక పథకాలు, కార్యక్రమాలు అమలుచేస్తున్నారన్నారు. ఇప్పుడు వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడత నిధుల పంపిణీ కూడా చేయడం జరిగిందని, ఈ మేరకు మండలంలోని 5,548 మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.10.40 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. ఈ నాలుగేళ్లలో వైఎస్సార్ చేయూత పథకం కింద రూ.40.88 కోట్లను మండలంలోని లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా నాయకులు, అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా కాదని, సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్ సీపీనే రానున్న ఎన్నికల్లోనూ గెలిపించాలని కోరారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని అసత్యాలను ప్రచారం చేసి, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఘోర ఓటమి తప్పదని, వైఎస్సార్ సీపీ భారీ విజయం ఖాయమని జోస్యం చెప్పారు. అనంతరం వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడత నిధుల నమూనా చెక్కును మహిళలకు ఎమ్మెల్యే అందజేశారు. ఇదిలా ఉండగా, లబ్ధిదారులంతా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, థాంక్యూ సీఎం సార్.. థాంక్యూ జగనన్న అని నినాదాలు చేసి, కృతజ్ఞత చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, మహిళా విభాగం కార్యదర్శి నల్లబిల్ల సుహాసిని, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ జయప్రకాష్, శివున్నాయుడు పాల్గొన్నారు.



వైఎస్సార్ చేయూత పథకం నమూనా చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళావతి